ఛీ.. సబ్సిడీ ధర సరిపోలేదు

- బయటి మార్కెట్లోనూ అదే ధరకు వేరుశనగ లభ్యం
- ప్రభుత్వం నిర్ణయించిన ధర గిట్టుబాటు కాలేదంటున్న రైతులు
- రైతు సేవ కేంద్రాల్లో మొదలైన విత్తన వేరుశనగ కాయల పంపిణీ



గంటాపురం వద్ద వేరుశనగ సాగుకు సిద్ధం చేసిన పొలం



పంపిణీ చేయడానికి సిద్ధంగా ఉన్న వేరుశనగ కాయలు

బత్తలపల్లి: ప్రభుత్వం సబ్సిడీ విత్తన వేరుశనగకు నిర్ణయించిన ధరపై అన్నదాతలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. బయటి మార్కెట్‌లో లభిస్తున్న ధరకు దగ్గరగా సబ్సిడీ ధర ఉందని, దీని వల్ల తమకు ఏమాత్రమూ ఊరట లభించడం లేదని అంటున్నారు. ధర్మవరం నియోజకవర్గంలో ఖరీఫ్ వేరుశనగ సాగుకు సమాయత్తమవుతున్నారు. ముందస్తు వర్షాలకు సేద్యాలు చేసుకున్న రైతులు ఇప్పుడు విత్తనం సాగుకు వర్షం కోసం ఆకాశం వంక చూస్తున్నారు. ఇదే సమయంలో ప్రభుత్వం సబ్సిడీ వేరుశనగ కాయలను పంపిణీ చేసేందుకు శ్రీకారం చుట్టింది. బుధవారం ధర్మవరం మండలంలో పంపిణీ ప్రారంభమైంది. గురువారం బత్తలపల్లి మండలంలో పంపిణీ చేపట్టనున్నారు. ఇప్పటికే నియోజకవర్గంలోని ధర్మవరం, బత్తలపల్లి, తాడిమర్రి, ముదిగుబ్బ మండలాలకు పది వేల క్వింటాళ్లు కేటాయించగా, అందులో ఐదు వేల క్వింటాళ్ల విత్తన వేరుశనగ కాయలను సరఫరా చేసింది.

ధర ఎక్కువే..

సబ్సిడీపై అందించే విత్తన వేరుశనగ కాయల ధర ఎక్కువగా ఉందని రైతులు చెబుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం క్వింటాలు వేరుశనగ పూర్తి ధర రూ.9,300గా నిర్ణయించింది. ఇందులో 40 శాతం సబ్సిడీ ప్రకటించింది. ఈ సబ్సిడీ పోను రైతులకు క్వింటాలు రూ.5,580కు పంపిణీ చేయడానికి చర్యలు తీసుకుంది. అయితే ఇదే ధరకు ప్రైవేట్ మార్కెట్లోనూ నాణ్యమైన విత్తనం దొరుకుతుందని రైతులు పేర్కొంటున్నారు. సబ్సిడీ మరింత పెంచితేనే ఉపశమనంగా ఉంటుందని అంటున్నారు. ప్రభుత్వం ధరపై పునరాలోచించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

రైతులకు భారమే..



ప్రభుత్వం నిర్ణయించిన వేరుశనగ విత్తనకాయల ధర రైతులకు భారమే. 40 శాతం సబ్సిడీ పోను క్వింటాలు రూ.5,580కు అందిస్తామని ప్రకటించింది. ప్రైవేట్ మార్కెట్‌లోనే ఈ ధరకు విత్తన కాయలు దొరుకుతున్నపుడు ఏదో గొప్ప సాయం చేసినట్లు 'సబ్సిడీ' అని పేరు పెట్టడం సబబు కాదు. సబ్సిడీ శాతం పెంచాలి.

– ప్రభాకరరెడ్డి, వైఎస్సార్‌సీపీ రైతు విభాగం అధ్యక్షుడు, బత్తలపల్లి

వేరుశనగ ధర తగ్గించాలి



ప్రభుత్వం సబ్సిడీపై సరఫరా చేస్తున్న వేరుశనగ కాయలు కన్నా బహిరంగ మార్కెట్లోనే ధర తక్కువగా ఉంది. దీంతో రైతులు సబ్సిడీ విత్తన కొనుగోలుకు ఆసక్తి చూపడంలేదు. రైతుల సంక్షేమమంటూనే వారిపై పెనుభారం మోపేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. దీనిపై తక్షణమే స్పందించి ధర తగ్గించి రైతులను ఆదుకోవాలి. – చెడిపోతుల గోపీనాథ్, రైతు, రాఘవంపల్లి

చేతిలో చిల్లి గవ్వలేదు..



కరువుకు నిలయంగా మారిన జిల్లాలో రైతుల వద్ద చిల్లిగవ్వ లేదు. ఇలాంటి పరిస్థితుల్లో విత్తన పంపిణీ మొదలైంది. ప్రభుత్వం ఎకరా పొలం ఉన్న రైతులకు ఉచితంగా వేరుశనగ విత్తనాలు పంపిణీ చేస్తే బాగుంటుంది.

– కమతం శివయ్య, రైతు, యర్రాయపల్లి

'సాక్షి'పై కక్షసాధింపు చర్యలు దుర్మార్గం



మాట్లాడుతున్నసిద్దే మోహన్‌రెడ్డి

తాడిమర్రి: అధికార తెలుగుదేశం పార్టీ నాయకులు 'సాక్షి' మీడియాపై కక్షసాధింపు చర్యలకు పాల్పడటం దుర్మార్గమని వైఎస్సార్‌సీపీ అనుబంధ యువజన విభాగం మండల కన్వీనర్ సిద్దే మోహన్‌రెడ్డి విమర్శించారు. బుధవారం మోదుగులకుంటలోని తన స్వగృహంలో మీడియాతో మాట్లాడారు. సాక్షి టీవీ చానల్‌లో రాజధాని అంశంపై నిర్వహించిన డిబేట్‌లో పాల్గొన్న వ్యక్తి అమరావతి మహిళల గురించి చేసిన వ్యాఖ్యలు ఖండించదగినవేనన్నారు. అయితే వ్యాఖ్యాతగా వ్యవహరించిన సీనియర్ జర్నలిస్టు కొమ్మినేని శ్రీనివాసరావును అరెస్టు చేయడం అన్యాయమన్నారు. ఇదే అదునుగా తీసుకున్న టీడీపీ కక్ష సాధింపులో భాగంగా అల్లరి మూకలతో కలిసి రాష్ట్ర వ్యాప్తంగా 'సాక్షి' కార్యాలయాలపై దాడులకు, విధ్వంసాలకు పాల్పడిందని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయకుండా.. ప్రజల దృష్టి మరల్చడానికి డైవర్షన్ పాలిటిక్స్ చేస్తోందని ఎద్దేవా చేశారు. దాడులకు పాల్పడిన వారిపై కేసులు నమోదు చేసి, వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు మారక రవీంద్రారెడ్డి, మారక శంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతతకు భంగం కలిగించొద్దు



పుల్లానారాయణపల్లిలో మాట్లాడుతున్న సీఐ శ్యామరావు

తాడిమర్రి: గ్రామాల్లో ప్రశాంత వాతావరణానికి ఎవ్వరూ భంగ కలిగించరాదని ముదిగుబ్బ సీఐ శ్యామరావు హెచ్చరించారు. ఎస్పీ ఆదేశాల మేరకు సిబ్బందితో కలసి ఆయన బుధవారం పిన్నదరి, పుల్లానారాయణపల్లి గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన గ్రామస్తుల సమావేశంలో సీఐ మాట్లాడుతూ ప్రజలు కక్షలు, ఘర్షణల జోలికి వెళ్లరాదన్నారు. పేకాట, మట్కా, క్రికెట్ బెట్టింగ్ తదితర అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలన్నారు. ఆన్‌లైన్ లావాదేవీలు, సైబర్ నేరగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. మద్యం తాగి వాహనాలు నడపటం, హెల్మెట్ లేకుండా ప్రయాణించడంతోనే ఎక్కువగా రోడ్డు ప్రమాదాలు జరుగుతాయన్నారు. వాహనదారులు రోడ్డు నిబంధనలు పాటించాలన్నారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ గంగాధర్, సిబ్బంది పాల్గొన్నారు.

వ్యవసాయ విద్యుత్ సరఫరాలో అంతరాయం



సబ్ స్టేషన్‌లో బైఠాయించిన రైతులు

గాండ్లపెంట: జీనులకుంట ఫీడర్ పరిధిలో వ్యవసాయ విద్యుత్ సరఫరాకు 15 రోజులుగా అంతరాయం ఏర్పడింది. దీంతో రైతులు సాగు చేసిన దోస, కళింగర, వేరుశనగ పంటలు ఎండిపోతున్నాయి. అధికారులకు తెలిపినా పట్టించుకోకపోవడంతో పోతలవాండ్లపల్లి రైతులు బుధవారం స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్‌కు చేరుకుని బైఠాయించారు. విద్యుత్ త్రీఫేజ్ ఉన్నా బోరు స్టార్టర్‌లో సింగిల్ ఫేజ్ చూపిస్తోందన్నారు. అలా కాకుండా త్రీఫేజ్ కరెంట్ సరఫరా పూర్తిగా నిలిపి వేయాలని, లేదంటే సమస్యను పూర్తిగా పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఆపరేటర్ రమేష్ సమస్యను ఫోన్ ద్వారా ఏఈ శ్రీనివాసులు దృష్టికి తీసుకెళ్లగా.. ఆయన రైతులపై పోలీసులకు ఫిర్యాదు చేయాలన్నారు. దీంతో రైతులు చంద్రారెడ్డి, కొండారెడ్డి, నారాయణరెడ్డి తదితరులు ఏఈ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏఈ వచ్చే వరకూ సబ్ స్టేషన్ నుంచి కదిలేది లేదని భీష్మించారు. విషయం తెలుసుకున్న ఏడీ ఓబులేసు అక్కడకు చేరుకుని రైతులతో మాట్లాడి రెండు రోజుల్లో సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చి శాంతింపజేశారు.

చినుకు పడితే చీకటే..!



వైఎస్సార్ కూడలిలో కరెంటు లేక అంధకారం

నల్లమాడ: మండలంలో వర్షం పడితే చాలు విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నారు. దీంతో రాత్రిపూట అంధకారంలో మగ్గాల్సి వస్తోంది. మంగళవారం వర్షం కురవడంతో రాత్రి 8 నుంచి బుధవారం ఉదయం 8.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. రాత్రంతా చిన్నారులు, వృద్ధులు ఉక్కపోత, దోమల బెడదతో ఇబ్బందులు పడ్డారు. గాలీవానకు మలకవేమల – నల్లమాడ మధ్య విద్యుత్ స్తంభాలు నేలకూలడంతో కరెంటు సరఫరాకు అంతరాయం ఏర్పడినట్లు సిబ్బంది చెబుతున్నారు. దశాబ్దాల క్రితం ఏర్పాటు చేసిన విద్యుత్ స్తంభాలు, కాసారాలు, పింగాణీలు పాడైపోయినా మరమ్మతులు చేయకపోవడంతో కొద్దిపాటి వర్షానికే విద్యుత్ సరఫరా ఆగిపోతున్నట్లు పలువురు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

పొగాకు వాడకం అనర్థదాయకం



ర్యాలీ చేస్తున్న వైద్య ఆరోగ్య సిబ్బంది

ముదిగుబ్బ: పొగాకు ఉత్పత్తుల వాడకం అనర్థదాయకమని డాక్టర్ రాజేంద్ర అన్నారు. బుధవారం ముదిగుబ్బ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో జాతీయ పొగాకు నియంత్రణ కార్యక్రమంలో భాగంగా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఈఓ వేమనారాయణ, రమణప్ప, జిల్లా పొగాకు నియంత్రణ సామాజిక కార్యకర్త శమంతకమణి, ఏఎస్‌ఐ నాగభూషణం, ఎంపీహెచ్‌ఈఓ భాస్కర్‌రెడ్డి, సిబ్బంది శివమ్మ, లక్ష్మీకుమారి తదితరులు పాల్గొన్నారు.

కుటుంబానికి అండగా ఉంటాం



మంగలి నరేష్ మృతదేహానికి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

కనగానపల్లి: అనారోగ్యంతో మృతి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త మంగలి నరేష్ కుటుంబానికి అండగా ఉంటామని ఆ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి తెలిపారు. మండలంలోని బాలేపాళ్యంలో గ్రామంలో పార్టీ కార్యకర్త నరేష్ అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలిసిందే. స్థానిక పార్టీ నాయకుల ద్వారా విషయం తెలుసుకున్న తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, పలువురు పార్టీ నాయకులు బుధవారం బాలేపాళ్యం గ్రామానికి వెళ్లి మృతుడు నరేష్‌కు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి పార్టీ తరపున అండగా ఉంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా యూత్ అధ్యక్షుడు గంగుల సుధీర్‌రెడ్డి, పలువురు మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజా పోరాటాలకు సిద్ధం కండి



మాట్లాడుతున్న చేతివృత్తిదారుల రాష్ట్ర అధ్యక్షుడు జింకా చలపతి

బత్తలపల్లి: గ్రామస్థాయి కమిటీలతో పార్టీని బలోపేతం చేసి ప్రజా సమస్యలపై పోరాటాలకు సిద్ధం కావాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ముసుగు మధు పిలుపునిచ్చారు. బుధవారం బత్తలపల్లిలోని సీపీఐ కార్యాలయంలో మండల కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. నియోజకవర్గ కార్యదర్శి మధు, చేతివృత్తిదారుల రాష్ట్ర అధ్యక్షుడు జింకా చలపతి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలు అమలు చేయకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రజా సమస్యలు, హామీల అమలు కోసం గ్రామ స్థాయి పోరాటాలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కమతం కాటమయ్య, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు మాల్యవంతం కుళ్లాయప్ప, మండల కార్యదర్శి బండల వెంకటేష్, దళిత హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షులు రామకృష్ణ, వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు వడ్డె సన్నపెద్దన్న, బత్తల నాగభూషణ, తాడిమర్రి మండల వ్యవసాయ కార్మిక సంఘం కార్యదర్శి లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయం లాభదాయకం

ఓడీచెరువు : ప్రకృతి వ్యవసాయం లాభదాయకమైనదని మండల వ్యవసాయాధికారి ఇలియాజ్ సూచించారు. బుధవారం ఓడీచెరువు, కొండకమర్ల రైతు సేవ కేంద్రాల్లో వికసిత్ కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. వ్యవసాయ శాస్త్రవేత్తలు మురుగన్, మాధవి, సజరుద్దీన్, ఏడీఏ సెరికల్చర్ శివరాం నాయక్, ఉద్యాన శాఖ అధికారి లావణ్య, ఆర్‌ఎస్‌కే సిబ్బంది నరేంద్ర, బాబాజాన్, రైతులు పాల్గొన్నారు. శాస్త్రవేత్తలు మాట్లాడుతూ ప్రస్తుతం ఉద్యాన, పాడి పరిశ్రమల శాఖలు అమలు చేస్తున్న పలు పథకాలను రైతులకు వివరించారు. వ్యవసాయాధికారి మాట్లాడుతూ సేంద్రియ ఎరువులు వాడకం వల్ల అధిక దిగుబడులు సాధించవచ్చని, ప్రతి ఒక్కరూ ప్రకృతి వ్యవసాయ పద్ధతులు పాటించాలని కోరారు.

నీటి తొట్టె ప్రారంభం

కదిరి అర్బన్ : కుమ్మరవాండ్లపల్లిలో నూతనంగా నిర్మించిన పశువుల నీటితొట్టెను ఎంపీడీఓ పోలప్ప బుధవారం ప్రారంభించారు. పాడి రైతులు ఈ నీటితొట్టెలను వినియోగించుకోవాలన్నారు.

ఏపీఎం అవినీతిపై నిగ్గు తేల్చండి

ఓడీచెరువు : వెలుగు ఏపీఎం రవీంద్రపై వస్తున్న అవినీతి ఆరోపణలపై విచారణ చేపట్టి వాస్తవాలు నిగ్గు తేల్చాలని ఎమ్మార్పీఎస్ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు రామాంజనేయులు, కార్యదర్శి లక్ష్మీపతి, నాయకులు రమణ, రవణప్ప, తిప్పన్న తదితరులు ఓడీచెరువు ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. స్వయం సహాయక సంఘాల (ఎస్‌హెచ్‌జీ)కు సంబంధించి ఏవైనా సంతకాలు కావాలన్నా.. సిబ్బందికి వేతన చెల్లింపు విషయంలో డబ్బులు డిమాండ్ చేస్తున్నట్లు, పలువురిపై కుల వివక్ష చూపుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయని పేర్కొన్నారు. మామూళ్లు ముట్టజెప్పకపోతే ఏ పనీ జరగదన్నారు. ఈ విషయాలు తెలిసి ఏపీఎంను ప్రశ్నిస్తే 'డప్పు కొట్టుకునే వాడికల్లా భయపడితే ఎలా..? మీకు చేతనైంది చేసుకో.. నాకు మా ఎమ్మెల్యే అండగా ఉన్నారు' అంటూ రెచ్చిపోతున్నారని ధ్వజమెత్తారు. ఈయనపై వచ్చిన ఆరోపణలపై విచారణ చేపట్టి.. క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

కేతిరెడ్డిని సన్మానించిన నేతలు



కేతిరెడ్డి వెంకటరామిరెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

ముదిగుబ్బ: వైఎస్సార్‌సీపీ ముదిగుబ్బ మండల ఉపాధ్యక్షులుగా నియమితులైన వేలూరి చంద్రమోహన్, శ్రావణ్‌కుమార్ బుధవారం మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డిని ధర్మవరంలోని నివాసంలో కలిసి ఘనంగా సన్మానించారు. తమ నియామకానికి కృషి చేసినందుకు కేతిరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ కన్వీనర్ సీపీ నారాయణరెడ్డి, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ భాస్కర్, ఎంపీటీసీ వెంకటశివారెడ్డి, చంద్రాయుడు, ఆదినారాయణ, కేశవ, సునీత, శివనాయక్, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రోడ్డు కోసం సర్వే



స్థలాన్ని పరిశీలిస్తున్న ఆర్డీఓ శర్మ

కదిరి అర్బన్: కుమ్మరవాండ్లపల్లిలో కదిరి కొండ చుట్టూ గిరిప్రదక్షిణ చేసేందుకు అవసరమైన రోడ్డు ఏర్పాటుకు బుధవారం ఆర్డీఓ శర్మ సర్వే నిర్వహించారు. ప్రతి నెలా స్వాతి నక్షత్రం రోజున కదిరి కొండ చుట్టూ గిరిప్రదక్షిణ చేసేందుకు రోడ్డు ఏర్పాటు చేయాలన్న భక్తుల కోరిక మేరకు ఈ సర్వే చేపట్టారు. త్వరలోనే రోడ్డు సౌకర్యం కల్పించేందుకు చర్యలు తీసుకోనున్నట్లు ఆర్డీఓ వెల్లడించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ పోలప్ప, తహసీల్దార్ మురళీకృష్ణ, మండల సర్వేయర్లు పాల్గొన్నారు.

కళాజ్యోతి కార్యవర్గం ఎంపిక



నూతన కార్యవర్గ సభ్యులు వీరే

ధర్మవరం రూరల్: ధర్మవరం కళాజ్యోతి నూతన కార్యవర్గాన్ని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షునిగా కుంటిమల నారాయణ, గౌరవాధ్యక్షునిగా పి.వెంకటనారాయణ, గౌరవ సలహాదారుగా ఎస్.రామకృష్ణ, ఉపాధ్యక్షులుగా జగ్గా వేణుగోపాల్, కార్యదర్శిగా బాల గుండా రామకృష్ణ, సంయుక్త కార్యదర్శిగా పాగాల అశ్వర్థ నారాయణ ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా కె. రమేష్, గూడూరు మోహన్‌దాస్, రాంప్రసాద్, పెద్దారెడ్డి, మధుసూదన్, రామన్న, డాక్టర్ సూర్యనారాయణరెడ్డి, మాయకుంట్ల ఆదినారాయణను ఎన్నుకున్నారు.

వివాహిత అదృశ్యం

కొత్తచెరువు: వివాహిత అదృశ్యమైంది. ఎన్నిచోట్ల వెదికినా కనిపించకపోవడంతో ఆమె తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వివరాలిలా ఉన్నాయి. కొత్తచెరువులోని బీసీ కాలనీకి చెందిన గంగమ్మ గుడి దగ్గర నివాసముంటున్న మల్లె సాయినాథ్ పెద్ద కుమార్తె సాయి లక్ష్మికి బత్తలపల్లి మండలం వెంకటగారిపల్లికి చెందిన హరితో 2016లో వివాహమైంది. వీరికి ఇద్దరు కుమారులు సంతానం. మే 12న కొత్తచెరువులో జరిగిన సంగమేశ్వర రథోత్సవం చూసేందుకని మెట్టినింటి నుంచి వచ్చింది. ఆ రోజు మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో ఇంటి నుంచి బయటకెళ్లి తిరిగి రాలేదు. ఎన్ని చోట్ల వెతికినా జాడ కానరాకపోవడంతో ఆమె తండ్రి కొత్తచెరువు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఇంటి నుంచి వెళ్లిపోయినపుడు తెలుపు రంగు లెగ్గిన్, నీలి రంగు టాప్ వేసుకుందని పేర్కొన్నాడు.

మరో వివాహిత మిస్సింగ్

తలుపుల: మండల కేంద్రం తలుపులలోని బలిజపేటలో సరస్వతి అనే వివాహిత మిస్సింగ్ అయినట్లు పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఎస్‌ఐ నరసింహుడు బుధవారం మీడియాకు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గాండ్లపెంట మండలం సోమయాజులపల్లికి చెందిన ఆంజినేయులు, సరస్వతి దంపతులు. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. మనస్పర్థల నేపథ్యంలో ఎనిమిదేళ్ల క్రితం భర్తను వదిలి తన పిల్లలతో తలుపులకు వచ్చి.. బలిజపేటలో నివాసముంటోంది. అయితే ఏప్రిల్ 22న ఇంటి నుంచి బయటకు వెళ్లిన సరస్వతి మళ్లీ తిరిగి రాలేదు. చాలా చోట్ల వెదికినా కనిపించకపోవడంతో కుమారుడు కార్తీక్ బుధవారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

గాలీవాన బీభత్సం



చిలకలగడ్డపల్లిలో విరిగిపడిన రేకుల షెడ్డు

పుట్టపర్తి: బుక్కపట్నం మండలంలో మంగళవారం రాత్రి గాలీవాన బీభత్సం సృష్టించింది. చిలకలగడ్డపల్లి రైతు రామనాథరెడ్డికి చెందిన రేకుల షెడ్డు ధ్వంసమైంది. రేకులు ఎగిరి 300 మీటర్ల దూరంలో పడిపోయాయి. షెడ్డులో నిల్వ ఉంచిన సామగ్రి, దాన్యపు గింజలన్నీ తడిసిపోయాయి. దాదాపు రెండు లక్షల రూపాయల నష్టం వాటిల్లినట్లు రైతు లబోదిబోమంటున్నాడు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నాడు. ఇక పలుచోట్ల విద్యుత్ స్తంభాలు విరిగి పడ్డాయి.

వైభవంగా చింతపూల ఉత్సవం



కదిరి టౌన్: పౌర్ణమి సందర్భంగా బుధవారం లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో చింతపూల ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. స్వామి వారిని ప్రత్యేక పల్లకీలో కొలువుదీర్చి తుమ్మల రోడ్డులో ఉన్న కుంతీ తీర్థం వద్దకు తీసుకెళ్లారు. చింతపూల మండపంలో అర్చకులు నిత్య కైంకర్యం నిర్వహించారు. అనంతరం తిరు వీధుల్లో ఊరేగించారు.

చట్టాలపై అవగాహన అవసరం

చెన్నేకొత్తపల్లి: మహిళలు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని ఆదిశక్తి సొసైటీ సీఈఓ కవిత అన్నారు. ఆదిశక్తి సొసైటీ ఆధ్వర్యంలో బుధవారం పల్లెన్నగారిపల్లిలో ఉచిత న్యాయ సలహా సదస్సు నిర్వహించారు. అనంతరం మహిళా చట్టాలపై నాటకం ప్రదర్శించారు.

విద్యార్థి మిత్ర కిట్లు సరఫరా



విద్యార్థి మిత్ర కిట్లను వాహనంలో పాఠశాలలకు తరలిస్తున్న దృశ్యం

నల్లమాడ: మండలంలోని ప్రభుత్వ పాఠశాలలకు సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర కిట్లను బుధవారం సరఫరా చేసినట్లు ఎంఈఓ 2 సురేష్‌బాబు తెలిపారు. కిట్లలో పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు, డిక్షనరీ, యూనిఫాం, షూస్, సాక్స్ ఉన్నాయన్నారు. బ్యాగులు సరఫరా కావాల్సి ఉందన్నారు. పాఠశాలలు పునఃప్రారంభం కానున్న గురువారం కిట్లను విద్యార్థులకు పంపిణీ చేయాలని హెచ్‌ఎంలకు సూచించారు.

ఎంపీడీఓ బాధ్యతల స్వీకరణ



శివరామప్రసాద్‌రెడ్డి

ఓడీచెరువు : నూతన ఎంపీడీఓగా జి.శివరామప్రసాద్ రెడ్డి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. సాధారణ బదిలీల్లో భాగంగా శివరామ ప్రసాద్‌రెడ్డి కడప జిల్లా నుంచి ఓడీచెరువుకు బదిలీ అయ్యారు. సచివాలయాల పనితీరును, ఉపాధి హామీ పథకం అమలును ప్రత్యేకంగా పర్యవేక్షించనున్నట్లు ఆయన తెలిపారు. కార్యలయ సిబ్బంది ఆయనను కలిసి అభినందనలు తెలిపారు

పేదలకు ఇంటి పట్టాలు ఇవ్వండి



ధర్నా చేస్తున్న సీఐటీయూ నాయకులు

తనకల్లు: పేదలకు ఇంటి పట్టాలు మంజూరు చేయాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిర్వహించిన ధర్నాలో నాయకులు శివన్న, ఒంటెద్దు వేమన్న మాట్లాడారు. తనకల్లు గ్రామ సర్వే నంబర్ 793లో ఇల్లు లేని నిరు పేదలకు ఇంటి పట్టాలను మంజూరు చేయాలని ఐదేళ్లుగా కోరుతున్నా రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాది దాటినా ఇంతవరకు పేదలకు ఇంటి పట్టాలను పంపిణీ చేయలేదన్నారు. మండల వ్యాప్తంగా ఇంటి స్థలాలు లేని పేదలందరికీ వెంటనే ఇంటి పట్టాలను అందజేసి, పక్కాగృహాలు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ శోభా సువర్ణమ్మకు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు వెంకటరమణ, చలపతి తదితరులు పాల్గొన్నారు.

మట్టి రోడ్డు ప్రారంభం

గాండ్లపెంట: వీరన్నగారిపల్లి నుంచి నారుకుంట్లవారిపల్లి వరకు రూ.50లక్షల ఉపాధిహామీ నిధులతో చేపట్టిన మట్టిరోడ్డు పనులను ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ బుధవారం ప్రారంభించారు. అలాగే జీడిమేకలపల్లిలో రూ.14 లక్షల వ్యయంతో నిర్మించిన అంగన్‌వాడీ కేంద్రం భవనం, ఉపాధి హామీ పథకంలో భాగంగా రూ.35 వేల వ్యయంతో నిర్మించిన నీటి తొట్టెను కూడా ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో తహసీల్దార్ బాబూరావు, ఎంపీడీఓ వెంకటరామిరెడ్డి, ఐసీడీఎస్ అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వేరుశనగ పంపిణీ

గాండ్లపెంట: మండల కేంద్రంలో ఎంపీపీ సోమశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం రైతులకు సబ్సిడీ విత్తన వేరుశనగకాయలు పంపిణీ చేశారు. 54 మంది రైతులకు 149 బస్తాలను పంపిణీ చేసినట్లు వీఏఏ గమనిక తెలిపారు.

సెల్‌ఫోన్ రిపేరీ శిబిరం



శిబిరాన్ని ప్రారంభిస్తున్న బ్యాంక్ మేనేజర్

ముదిగుబ్బ: రూడ్‌సెట్ సంస్థ ఆధ్వర్యంలో బుధవారం ముదిగుబ్బ కెనరా బ్యాంక్ ఆవరణలో సెల్‌ఫోన్ రిపేరీ శిబిరం నిర్వహించారు. బ్యాంక్ సీనియర్ మేనేజర్ లక్ష్మీనరసింహులు శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా 200 సెల్‌ఫోన్లకు సంబంధించి మైనర్ రిపేరీలు, సర్వీసింగ్ ఉచితంగా చేశారు. కార్యక్రమంలో డైరెక్టర్ విజయలక్ష్మి, శిక్షకులు నాగేంద్ర, రాజశేఖర్ రెడ్డి, ఇలియాజ్ తదితరులు పాల్గొన్నారు.